సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



సహాయక చర్యలు చేపట్టాలి

కర్మాగారాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ అంబేడ్కర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

–8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,190
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,196
3 శాతం జీఎస్టీతో	రూ.5,352
సవర (8 గ్రా)	రూ.42,816

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.2 /22.0

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. మంగళవారం ఒక్క రోజే రెండు సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రత పెరిగింది. గాలిలో తేమ 54 శాతంగా ఉంది.

న్యూస్‌రీల్

సోమశిలలో 63.470 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 63.470 టీఎంసీలు ఉన్నాయి. 315 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 1,920, ఉత్తర కాలువకు 653, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 343 క్యూసెక్కులు ఆవిరవుతోంది.

జీజీహెచ్‌లో నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): నగరంలోని గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి (పెద్దాస్పత్రి)కి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని వైద్యశాఖాధికారులను కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశించారు. మంగళవారం పెద్దాస్పత్రి అభివృద్ధి సొసైటీ కమిటీ సమావేశం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. కలెక్టర్ మాట్లాడు తూ రోగులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీ సునంద, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈ విజయభాస్కర్, అభివృద్ధి కమిటీ సభ్యులు అభిషేక్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఆస్పత్రికి చెందిన వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, వైద్యులు పాల్గొన్నారు.

సాగుపై అధ్యయనం



సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సంగం: నెల్లూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు వ్యవసాయ కృషి, అనుభవ పథకం కింద సంగం మండలంలోని వెంగారెడ్డిపాళెం, సిద్దీపురం గ్రామాలలో పంటల సాగుపై ఆధ్యయనం చేస్తున్నారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎంసీ ఓబయ్య, శాస్త్రవేత్త డాక్టర్ వీ సురేఖాదేవిలు పర్యవేక్షణ చేస్తున్నారు.

మాతృభాష ఉనికిని కాపాడుకుందాం



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ సుందరవల్లి

వెంకటాచలం: ప్రతి ఒక్కరూ మాతృభాషలో తమ భావాలను వ్యక్తం చేయడమే కాకుండా, మాతృభాష ఉనికిని కాపాడుకునేందుకు కృషి చేయాలని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి అన్నారు. మండలంలోని సరస్వతీనగర్‌లో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో మాతృభాష దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ రాజ్ మణిపాల్, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ డాక్టర్ శివరామ ప్రసాద్, డాక్టర్ మాలకొండయ్య, డాక్టర్ దివ్య, డాక్టర్ రాజారాం తదితరులు పాల్గొన్నారు.

చేపల కాలనీలో విస్తృత తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారుల బృందం

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల చేపలకాలనీలో మంగళవారం మత్స్యశాఖ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, అటవీశాఖ, జలవనరుల శాఖ, చేపల సొసైటీ, మత్స్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మత్స్యశాఖ ఉపసంచాలకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయాశాఖల బృందాలు చేపల కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ తనిఖీల్లో మత్స్యకారుల వద్ద నిషేధిత వలలు లేవని గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయకురాలు గోపిచందన, కమిటీ సభ్యులు పుల్లయ్య, మహేష్, రామయ్య, ప్రభాకర్, మస్తానయ్య, కంభంపాడు చెరువు సొసైటీ సభ్యులు ముక్కు నాగరత్నం, మత్స్యకార సంఘం నాయకులు సీహెచ్ చక్రయ్య, ఎస్.వెంకటరమణ, పెంచలయ్య, హరిప్రసాద్, దేవుడు పాల్గొన్నారు.

నిండుగా నీరు.. దండిగా సాగు



నిండుకుండలా ఉన్న రాళ్లపాడు ప్రాజెక్ట్



రైతులు సాగు చేస్తున్న వరి పంట



- రాళ్లపాడు ప్రాజెక్ట్ పరిధిలో ఆయకట్టు రైతుల ఖుషీ
- సోమశిల నుంచి వస్తున్న 1.5 టీఎంసీలు
- రూ.700 కోట్లతో ఉత్తర కాలువ అభివృద్ధి పనులు
- వరి, పత్తి పంటలను సాగుచేస్తున్న రైతులు
- రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపునకు సీఎం హామీ

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు సోమశిల జలాలు చేరుతుండడంతో బీళ్లుగా ఉన్న పొలాలు పంట భూములుగా మారాయి. మూడేళ్ల నుంచి ఈ ప్రాజెక్ట్ కింద వరి, పత్తి పంటలను రైతులు దాదాపు 25 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వెలిగొండ నుంచి కూడా 1.17 టీఎంసీల నీరు ఈస్టన్ కెనాల్ ద్వారా రాళ్లపాడుకు చేరేలా పనులు సాగుతున్నాయి. రాళ్లపాడు ప్రాజెక్ట్‌ను 1956లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఉన్నప్పుడు ఏడు చదరపు కిలో మీటర విస్తీర్ణంలో నిర్మించారు. అప్పట్లో ప్రాజెక్ట్‌కు పది పెద్ద గేట్లను, రెండు బురద గేట్లను బిగించారు. కుడి, ఎడమ కాలువలను ఏర్పాటు చేశారు. అప్పటి ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 15 వేల ఎకరాలను ఆయకట్టు కిందకు చేర్చారు. వర్షాధారంగా నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌లో వచ్చే నీటి ద్వారా అప్పటి నుంచి ఆయకట్టు కింద వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. అయితే 2002లో ఎగువ భాగం నుంచి వర్షం నీరు ఎక్కువగా రావడంతో కట్ట తెగిపోయింది. దీంతో ఇరిగేషన్ అధికారులు కట్ట తెగిన స్థానంలో కొత్తగా ఐదు హైడ్రాలిక్ గేట్లను ఏర్పాటు చేశారు. ఈ గేట్లను బిగించడం వల్ల ఎంత వర్షం కురిసినా దిగువకు నీటిని విడుదల చేసేందుకు వీలు ఏర్పడింది. ప్రస్తుతం ఆయకట్టు కింద అధికారికంగా 15 వేల ఎకరాలు, అనధికారికంగా 10 వేల ఎకరాలు వెరసి దాదాపు 25 వేల ఎకరాలు సాగులో ఉంది.

సోమశిల జలాలు వచ్చేలా కృషి..

రాళ్లపాడుకు సోమశిల జలాలు 1.5 టీఎంసీలు వచ్చేలా ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి కృషి చేయడంతో ఉత్తర కాలువ ద్వారా నీరు చేరుతోంది. ఉత్తర కాలువ తక్కువ వెడల్పు ఉండడంతో రూ.700 కోట్లతో కాలువ వెడల్పు పనులు మొదలుపెట్టి 80 శాతం పూర్తి చేశారు. అలాగే ఆత్మకూరు వద్ద ఉన్న రాజోలి ట్యాంకుకు నీరు వెళ్లకుండా నేరుగా నీరు వచ్చేలా కాలువను తవ్వుతున్నారు. ఈ కాలువ పనులు పూర్తయితే రాళ్లపాడుకు 150 క్యూసెక్కుల నీరు వచ్చే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. అలాగే వెలిగొండ ప్రాజెక్టు నుంచి 1.17 టీఎంసీల నీరు ఈస్టన్ కెనాల్ ద్వారా రాళ్లపాడుకు వచ్చే కాలువ పనులు త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ప్రకటించారు. ఈ కాలువ తవ్వేందుకు కేవలం రూ.4 కోట్లతో పనులు పూర్తవుతాయని, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయి త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ ఏడాదిలో కాలువ పనులు పూర్తయితే రాళ్లపాడుకు ఇటు సోమశిల జలాలు అటు వెలిగొండ జలాలతో ఎప్పుడూ నిండు కుండలా ఉండి రెండు పంటలు పండుతాయని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



మర్రిగుంట వద్ద ఉత్తర కాలువలో పారుతున్న సోమశిల జలాలు

రూ.40 కోట్లతో ఎడమ కాలువ పొడిగింపు పనులు

గత ప్రభుత్వాలు రాళ్లపాడు ఎడమ కాలువ పనులను మొదలు పెట్టలేదు. ఎడమ కాలువకు రూ.40 కోట్లు ఖర్చవుతుందని, 150 ఎకరాల భూమి అవసరం అవుతుందని గతంలో గుర్తించారు. సోమశిల ఉత్తర కాలువ పొడిగింపుతో వచ్చే అదనపు నీటితో రాళ్లపాడు ఎడమ కాలువ పరిధిలోని పది గ్రామాలకు సాగునీటి సమస్య తీరుతుందని అధికారులు లెక్కలు వేశారు. ఎవరూ పనులు ప్రారంభించలేదు. గతేడాది జూలై 20న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రామాయపట్నం పోర్టు శంకుస్థాపనకు వచ్చినప్పుడు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ఎడమ కాలువ విస్తరణ గురించి వివరించారు. దీంతో సీఎం వెంటనే స్పందించి ఎడమ కాలువ విస్తరణకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం భూసేకరణ జరుగుతోందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

సమృద్ధిగా వర్షాలు



రాళ్లపాడు ఆయకట్టు పరిధిలో సాగు చేస్తున్న పత్తి పంట

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాళ్లపాడు ఆయకట్టు భూములు పూర్తిస్థాయిలో సాగులోకి వచ్చాయి. నాలుగేళ్ల నుంచి సమృద్ధిగా వర్షాలు కురవడంతో పాటు సోమశిల జలాలు ప్రాజెక్టుకు చేరుకుంటుండడంతో నీటికి ఇబ్బందులు తొలగాయి. ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ఆయకట్టుకు నీరిస్తాం రైతులు వరి పంట పండించుకోండని హామీ ఇవ్వడంతో 2019, 2020లో రైతులు వరి పంటను పండించారు. అయితే 2021లో వర్షాలు కురవటం ఆలస్యం కావడంతో రైతులు వరి పంటకు బదులుగా పత్తి సాగు చేశారు. అనూహ్యంగా పత్తి క్వింటా రేటు రూ.12 వేల వరకు పెరగడంతో రైతులకు లాభాలు వచ్చాయి. గత ఏడాది కూడా నవంబర్ చివరలో ఆలస్యంగా వర్షాలు కురిసి ప్రాజెక్టు నిండడంతో ఆయకట్టు పరిధిలో 5 వేల ఎకరాల్లో వరి, 20 వేల ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగు చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 20 అడుగులు నీటిమట్టం ఉంది.

పంటలకు సమృద్ధిగా నీరిస్తాం

రాళ్లపాడు ఆయకట్టు పరిధిలో వేసిన వరి, పత్తి పంటలకు చివరి వరకు నీరిస్తాం. వర్షాలు ఆలస్యంగా కురవడంతో గత ఏడాది నవంబర్ చివరి వారంలో వరి పంటకు నీరిస్తామని చెప్పాం. కానీ వరి పంటకు ఆలస్యమవుతుందని రైతులు పత్తి పంట వైపే మొగ్గు చూపారు. రాళ్లపాడుకు సోమశిల జలాలు 70 నుంచి 100 క్యూసెక్కులు చేరుతున్నాయి. ప్రాజెక్టులో నీరు నిండుగా ఉండడంతో నీటి పారుదలకు ఢోకా లేదు. సాగునీటితో పాటు 114 గ్రామాలకు ప్రాజెక్టు నుంచి మంచి నీటిని కూడా పంపింగ్ చేస్తాం.

లక్ష్మీనారాయణ, రాళ్లపాడు డీఈఈ

రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తి అమలు

- రాజ్యాధికారంలో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట
- మంత్రి కాకాణి, బాలినేని, వేమిరెడ్డి
- ఎమ్మెల్సీ అభ్యర్థులతో సమీక్ష
- నేడు మేరిగ మురళి నామినేషన్



సమావేశంలో మాట్లాడుతున్న కాకాణి, బాలినేని, వేమిరెడ్డి, ఎమ్మెల్యేలు

నెల్లూరు (సెంట్రల్): రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని రాజ్యాధికారంలో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికలపై మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రుల, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామని కాకాణి పిలుపునిచ్చారు. బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతి ఒక్కరం ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని, వాటి కుట్రలను తిప్పకొట్టాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు కల్పించారని గుర్తు చేశారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి చరిత్ర సృష్టించారన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అందరం కలిసికట్టుగా మూడు ఎమ్మెల్సీ స్థానాలు వైఎస్సార్‌సీపీ ఖాతాలో వేసుకుందామన్నారు. ప్రధానంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి కనీసం పోటీ కూడా ఉండదని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యేలు మానుగుంట మహీధర్‌రెడ్డి, పోలుబోయిన అనిల్‌కుమార్, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ అభ్యర్థులు మేరిగ మురళి, పి చంద్రశేఖర్‌రెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మురళి నామినేషన్

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బుధవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. జిల్లాలో స్థానిక సంస్థలన్నీ కూడా వైఎస్సార్‌సీపీ స్వీప్ చేసిన నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు పోటీ చేసే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

పట్టభద్రులకు ఐదు నామినేషన్ల దాఖలు

- నామినేషన్ల దాఖలుకు ఈ నెల 23 ఆఖరు తేదీ
- నేడు అట్టహాసంగా వైఎస్సార్‌సీపీ బలపరిచిన గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లు
- ఇప్పటి వరకు పట్టభద్రులకు 7, టీచర్‌కు ఒకటి



నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రకాశం జిల్లాకు చెందిన కిరణ్‌దాసరన్న

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ నామినేషన్లు స్వీకరించారు. మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ప్రకాశం జిల్లాకు చెందిన కిరణ్‌దాసరన్న మట్టిగుంట, మాదసి జాలారావు, భాస్కరరావు కమ్మిశెట్టి, తిరుపతి జిల్లా వాకాడు మండలానికి చెందిన బొట్టికాయల చంద్రశేఖర్ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా, తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి తరఫున (బీజేపీ అనుబంధం) జగదీశ్వర్‌నాయుడు నామినేషన్లు దాఖలు చేశారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి, ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక ఎమ్మెల్సీ స్థానానికి ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదని రిటర్నింగ్ అధికారి, జేసీ వెంకటేశ్వర్ వెల్లడించారు. కాగా నామినేషన్ల స్వీకరణ ఘట్టం మొదలైన 16వ తేదీ నుంచి మంగళవారం వరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 7, టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 1, స్థానిక సంస్థలకు 0 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణకు ఈ నెల 23వ తేదీ వరకు అవకాశం ఉండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. ఈ నెల 24న నామినేషన్ల స్క్రూటినీ జరగనుంది. ఈ నెల 27వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం తుది జాబితా ప్రకటిస్తారు.

నేడు అట్టహాసంగా నామినేషన్లు

వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు బుధవారం అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేయనున్నారు. టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి బుధవారం జిల్లా కేంద్రంలోని గాంధీసర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్లు దాఖలు చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

అందరివాడు గౌతమ్



గౌతమ్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- ఆయన లేనిలోటు తీర్చలేనిది
- గౌతమ్ చిరస్మరణీయుడు
- నిష్పక్షపాతిగా, మచ్చలేని నేతగా ఎదిగారు
- మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు
- గౌతమ్‌రెడ్డికి ఘన నివాళులు



ఎవర్ లాస్టింగ్ గౌతమ్‌రెడ్డి పుస్తకావిష్కరణ



వర్ధంతికి హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు

మర్రిపాడు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా అందరివాడుగా, నిష్పక్షపాతిగా, మచ్చలేని నేతగా ఎదిగారని మంత్రి, ఎమ్మెల్యేలు, నాయకులు కొనియాడారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో మంగళవారం గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి, పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు మేకపాటి గౌతమ్‌రెడ్డి చిత్రపటాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రిగా గౌతమ్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. మచ్చలేని నాయకుడు గౌతమ్‌రెడ్డి అని అన్నా రు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ గౌతమన్న నేను కలిసి మెలిసి పనిచేశామని, ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. మాజీమంత్రి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మేరిగ మురళీ, ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు సింగసాని గురుమోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తన కుమారుడు గౌతమ్‌రెడ్డి అకాల మరణం ఈ ప్రాంత వాసులకు తీరని లోటు అన్నారు. గౌతమ్ ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ గౌతమన్న ఆశయాలకు అనుగుణంగా ఎంజీఆర్ ఫౌండేషన్ ద్వారా ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గంగవరపు శ్రీనివాసులు నాయుడు, బొర్రా సుబ్బిరెడ్డి, సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, ఆదిశేషయ్య, రాపూరు వెంకట సుబ్బారెడ్డి, ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కొమ్మి సిద్దులునాయుడు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు పలు ప్రాంతాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

'ఎవర్ లాస్టింగ్ గౌతమ్‌రెడ్డి' పుస్తకావిష్కరణ

గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని రచయిత టీ వేణుగోపాల్‌రెడ్డి రచించిన 'ఎవర్ లాస్టింగ్ గౌతమ్‌రెడ్డి' పుస్తకాన్ని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆవిష్కరించారు. గౌతమ్‌రెడ్డి కీర్తి ప్రతిష్టలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయనే నేపథ్యాన్ని పుస్తక రూపంలో రచించినట్లు రచయిత తెలిపారు.

ఎస్పీఎల్ క్రికెట్ సంబరం ప్రారంభం

- ఉత్సాహంగా మొదలైన రీజనల్ క్రికెట్ పోటీలు
- తొలిరోజు ఆరు జట్ల మధ్య రసవత్తర పోరు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విజ్ఞాన్ వీసీ నాగభూషణం, రిజిస్ట్రార్ డాక్టర్ రఘునాథన్

చేబ్రోలు(పొన్నూరు): సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) రీజనల్ స్థాయి జూనియర్స్, సీనియర్ పురుషుల క్రికెట్ పోటీలు గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మొదటిరోజు జరిగిన మూడు మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు ఆలోచనలకు ఎప్పుడూ బ్రేక్ ఇవ్వకూడదని సూచించారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే సంకల్పంతో ముందుకెళ్లాలన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. విజయాన్ని, ఓటమిని సరిసమానంగా తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలంటే ఏదో ఒక క్రీడపై మక్కువ పెంచుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడా స్ఫూర్తితో మెలగాలని సూచించారు. క్రీడాకారులతో పరిచయ కార్యక్రమాల అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ మ్యాచ్‌లను గుంటూరు జిల్లా సాక్షి బ్రాంచ్ మేనేజర్ టి.గోపి పర్యవేక్షించారు.

నేటి మ్యాచ్‌లు

జూనియర్స్ విభాగంలో.. : ఏలూరు సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కళాశాల, గుంటూరు కల్లం హరనాథరెడ్డి కళాశాల జట్ల మధ్య.
రీజనల్ సీనియర్స్ ఫైనల్ మ్యాచ్.. : తిరుపతి జిల్లాలోని ఎన్‌బీకేఆర్, ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య.
రీజనల్ జూనియర్స్ ఫైనల్ మ్యాచ్.. : మొదటి మ్యాచ్ విజేత, ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల జట్ల మధ్య జరుగుతుంది.

9.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి..


21 పరుగులు చేసిన నందు

రీజనల్ జూనియర్స్ విభాగంలో మొదటి మ్యాచ్ ఒంగోలు పేస్ డిప్లొమా కాలేజీ, గుంటూరులోని కల్లం హరనాథరెడ్డి కాలేజీ జట్ల మధ్య జరిగింది. కల్లం కళాశాల జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. పేస్ కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది. బౌలర్ అవినాష్ 2 వికెట్లతో రాణించాడు. అనంతరం 71 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన కల్లం కాలేజీ 9.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. మూడు ఫోర్లు, ఒక సిక్స్‌తో 21 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన నందు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. బౌలర్లలో ఎంఎస్ బాలాజీ 2 వికెట్లు తీసుకున్నాడు.


గెలుపొందిన హరనాథరెడ్డి కళాశాల జట్టు

సీఆర్ రెడ్డి ఘన విజయం

సీనియర్స్ రీజనల్ మొదటి మ్యాచ్ ఏలూరులోని సీఆర్ రెడ్డి, ఒంగోలులోని పేస్ ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య సాగింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన సీఆర్ రెడ్డి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. వి.గగన్ కుమార్ 20, కె.నాగవెంకట్ 20 పరుగులతో రాణించారు. పేస్ జట్టు బౌలర్లలో కె.సాయి కుమార్ 2 వికెట్లు తీశాడు. 70 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన పేస్ జట్టు 8.5 ఓవర్లలో 27 పరుగులకు ఆలౌటై ఓటమి పాలైంది. సీఆర్‌రెడ్డి బౌలర్లలో ఎ.నిఖిల్ 4 వికెట్లతో రాణించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.


నాలుగు వికెట్లు తీసిన నిఖిల్


విజయం సాధించిన సీఆర్ రెడ్డి కళాశాల జట్టు

ఉత్కంఠ పోరులో ఎన్ఆర్ఐ విజయకేతనం

రెండో మ్యాచ్ ఉమ్మడి కృష్ణా జిల్లా ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ, నెల్లూరు వివేకానంద జూనియర్ కాలేజ్ జట్ల మధ్య ఉత్కంఠగా సాగింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎన్ఆర్ఐ కాలేజీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 61 పరుగులు చేసింది. ఇర్ఫాన్ సింగ్ 19 పరుగులు, ఎం.రూపేష్ 17 పరుగులతో రాణించారు. బౌలర్లలో ఎస్‌కే వారీషా రెండు వికెట్లు తీశాడు. 62 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన వివేకానంద జట్టు 9.5 ఓవర్లలో 50 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. ఎన్ఆర్ఐ బౌలర్ ఎస్‌కే జాఫర్ 4 వికెట్లతో రాణించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.


నాలుగు వికెట్లు తీసిన జాషువా


గెలుపొందిన ఎన్ఆర్ఐ కళాశాల జట్టు

క్లుప్తంగా

యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి

- కలెక్టర్లతో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ డాక్టర్ అంబేడ్కర్

నెల్లూరు(అర్బన్): కర్మాగారాల్లో అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ డాక్టర్ అంబేడ్కర్ సూచించారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు నుంచి ఎన్‌డీఎంఏ సలహాదారు మొహంతితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి నెల్లూరు కలెక్టరేట్ నుంచి డీఆర్వో వెంకటనారాయణమ్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం మారుతీప్రసాద్, డీఎస్పీ సుభానీ, నగరపాలక సంస్థ ఎస్ఈ సంపత్ కుమార్, ఏఎంవీఐ రఘు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో రసాయనాల వల్ల జరిగే ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటి నివారణకు కృషి చేయాలన్నారు. రెండో దశ టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్, ఈనెల 23న జిల్లా స్థాయిలో జరపాల్సిన మూడోదశ మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. 4,143 మంది విద్యార్థులకు గానూ 3,701 మంది హాజరైనట్లు తెలియజేశారు. వెంకటగిరిలోని ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఒకరు, రాపూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరిని డిబార్ చేశారన్నారు.

గిరిజన బాలికపై లైంగికదాడి

కోవూరు: అభంశుభం తెలియని ఓ బాలికపై లైంగికదాడి జరిగిన ఘటన మండలంలోని గుమ్మళ్లదిబ్బ గిరిజన కాలనీలో జరిగింది. ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గిరిజన కాలనీలో నివాసముంటున్న నీరుగంటి పవన్ అక్కడ డిష్‌లో పనిచేస్తుంటాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై లైంగికదాడి చేశాడు. అనంతరం ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో కోవూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు దర్యాప్తు చేసి నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:114
లేయర్ (లైవ్)	:75
బ్రాయిలర్ చికెన్	:200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:224
లేయర్ చికెన్	:128



నిమ్మధరలు (కిలో)

పెద్దవి	:రూ.70
సన్నవి	:రూ.60
పండ్లు	:రూ.30



కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

- పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు


మాట్లాడుతున్న రుద్రరాజు, పక్కన నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా 'హాథ్ సే హాథ్ జోడో అభియాన్' సమీక్షా సమావేశాలను నిర్వహిస్తున్నామని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. పీసీసీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మొదటిసారి మంగళవారం నెల్లూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా నెల్లూరులోని ఇందిరాభవన్‌లో నాయకులతో జరిగిన సమీక్షలో పాల్గొని మాట్లాడారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేసి అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. ఆ పాదయాత్రకు కొనసాగింపుగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి గతంలో పార్టీ చేసిన అభివృద్ధి, నేడు బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పొత్తుల విషయాన్ని ఏఐసీసీ నిర్ణయిస్తుందన్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ దేశ ప్రధాని అయితే పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి మెయప్పన్, జనరల్ సెక్రటరీ మస్తాన్‌వలీ, జిల్లా ఇన్‌చార్జిలు రామ్‌భూపాల్‌రెడ్డి, రంగస్వామి, సీనియర్ నాయకులు సీవీ శేషారెడ్డి, బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్

- ఆర్ఐఓ వరప్రసాద్‌రావు


మాట్లాడుతున్న ఆర్ఐఓ వరప్రసాద్‌రావు, పక్కన అధికారులు

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఈనెల 26 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ వరప్రసాద్‌రావు తెలిపారు. నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న కార్యాలయంలో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. రెండు విడతల్లో ప్రాక్టికల్స్ జరుగుతాయని చెప్పారు. తొలివిడత ఈనెల 26 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు 87 కేంద్రాల్లో, రెండో విడత వచ్చేనెల 3 నుంచి 7వ తేదీ వరకు 87 కేంద్రాల్లో జరుగుతాయన్నారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఒకేషనల్ విద్యార్థులకు ఈనెల 20వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభమైనట్లు చెప్పారు. జనరల్‌కు సంబంధించి ఎంపీసీలో 15,367 మంది, బైపీసీలో 4,611 మంది హాజరుకానున్నట్లు తెలియజేశారు. నాన్ జంబ్లింగ్ విధానంలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. మొత్తం 350 మంది ఎగ్జామినర్లను నియమించినట్లు తెలిపారు. కన్వీనర్‌గా ఆర్ఐఓ ఉంటారన్నారు. పరీక్షలు పక్కాగా నిర్వహించేందుకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, హైపవర్ కమిటీని నియమించామన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో డీవీఈఓ మధుబాబు, డీఈసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, హైపవర్ కమిటీ సభ్యులు సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకుడు కిష్టన్న మృతి


వెంకట కృష్ణమూర్తి (ఫైల్)

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఫుట్‌బాల్ సీనియర్ క్రీడాకారుడు, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకుడు వీరిశెట్టి వెంకటకృష్ణమూర్తి (కిష్టన్న) (87) మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు. తొలిరోజుల్లో దక్షిణ భారతదేశంలో ఫుట్‌బాల్ క్రీడ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన ఆయన్ను అందరూ కిష్టన్నగా పిలుస్తుంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, హైదరాబాద్ ఫుట్‌బాల్ అసోసియేషన్లలో కీలక నాయకుడిగా ఉండి ఎంతోమంది క్రీడాకారులను ప్రోత్సహించారు. ఆయన రాష్ట్ర, నెల్లూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ల వ్యవస్థాపకుడిగా ఉన్నారు. కిష్టన్న శిష్యులు రైల్వేస్, ఆడిట్ జనరల్, పోలీస్ శాఖల్లో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించారు. తన బంగారు వ్యాపారాన్ని ఫణంగా పెట్టి ఎందరినో తీర్చిదిద్దిన కిష్టన్న ఐదు దశాబ్దాలపాటు పైగా ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి పాటుపడ్డారు. ఆయన మృతి క్రీడా రంగానికి తీరని లోటని చీఫ్ కోచ్ యతిరాజ్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి ఉమా శంకర్‌తోపాటు సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు, వివిధ క్రీడా అసోసియేషన్లకు చెందిన నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు బుధవారం నెల్లూరు నగరంలోని టెక్కేమిట్టలో గ్యాస్ ఏజెన్సీ వద్ద ఉన్న మానస అపార్టుమెంట్ నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు మలిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు.

మృతుడు తమిళనాడు వాసి

నెల్లూరు(క్రైమ్): రైలు ఢీకొని చనిపోయిన వృద్ధుడి వివరాలు లభ్యమయాయి. ఆయన్ను తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా పెరియపాళేనికి చెందిన ఎం.సుబ్రహ్మణ్యం (74) విశ్రాంత ఉపాధ్యాయుడిగా గుర్తించారు. మంగళవారం రైల్వే పోలీసులు వివరాలు వెల్లడించారు. సుబ్రహ్మణ్యంకు భార్య, ముగ్గురు కుమారులున్నారు. ఆయనకు గొలగమూడి వెంకయ్యస్వామి పట్ల భక్తి విశ్వాసాలున్నాయి. దీంతో వీలున్నప్పుడు అక్కడికి చేరుకుని స్వామిని దర్శించుకుని వెళ్లేవాడు. శనివారాలు, పండగ రోజుల్లో గొలగమూడిలోనే ఉంటూ వలంటీర్‌గా విధులు నిర్వహించేవాడు. ఈక్రమంలో సోమవారం సుబ్రహ్మణ్యం పెరియపాళెం నుంచి నెల్లూరుకు వచ్చాడు. రైల్వేస్టేషన్‌లో దిగి సీఏఎస్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని మెట్ల వద్దకు రైలుపట్టాలపై నడుచుకుంటూ బయలుదేరాడు. ఈక్రమంలో బెంగళూరు నుంచి ధన్‌బాద్ వెళ్తున్న రైలు వేగంగా ఢీకొనడంతో తలకు గాయమై మృతిచెందాడు. ఘటనా స్థలంలో లభించిన మృతుడి సెల్‌ఫోన్, వెంకయ్యస్వామి సేవా వలంటీర్ గుర్తింపు కార్డును రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాని ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారులు నెల్లూరుకు చేరుకున్నారు. మంగళవారం మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు శవపరీక్ష నిర్వహించి కుమారులకు అప్పగించారు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమైందని..

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- రక్షించిన పోలీసులు

విడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): ప్రేమ విఫలమైందని పురుగు మందు తాగేందుకు సిద్ధపడిన ఓ యువకుడిని విడవలూరు పోలీసులు రక్షించారు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి మండలంలోని దంపూరు పొలాల వద్ద జరిగింది. ఎస్సై అంజనేయులు కథనం మేరకు.. రామతీర్థం గ్రామానికి చెందిన తిరుమల అనే యువకుడు తన ప్రేమ విఫలమైందని, దీంతో పురుగు మందు తాగి చనిపోతానని స్నేహితుడైన నరేష్‌కు ఫోన్ చేసి చెప్పాడు. నరేష్ వెంటనే ఈ విషయాన్ని తిరుమల తల్లిదండ్రులకు చెప్పాడు. అలాగే పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సై ఆదేశాలతో సిబ్బంది మస్తానయ్య, నరసింహ తిరుమల ఫోన్ టవర్ లొకేషన్ తెలుసుకునేందుకు ప్రయత్నించారు. అతను తుమ్మగుంట – దంపూరు మధ్య ఉన్న పొలాల్లో ఉన్నట్లు గుర్తించి వెంటనే అక్కడికి వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. తిరుమలను తల్లిదండ్రులకు అప్పగించడంతో పోలీసులను గ్రామస్తులు అభినందించారు.